...శావల్ దర్శన్

శివల జగన్నాధరావు

'సిరికి చెప్పలేదు. ఆయుధాల్ని చేత ధరింపలేదు. పరివారాన్ని వెంట తీసుకు వెళ్ళనేలేదు... ఎక్కడి వక్కడే వదిలేసి... వున్నవాడు వున్నట్టె కదిలి ... ఆహాహా! కరుణాంతరంగుడని, దయా సముద్రుడని, ఆర్తత్రాణ పరాయణుడని వుత్తినే అన్నారా, ఆ మహావిష్ణువుని?...'

భాగవతంలో ఆ పేజీ చివర్న మడిచి—పుస్తకం మూసి—కళ్ళద్దాలు తీసి—చెమ్మగిల్లిన కళ్ళను పంచెకొనతో ఒత్తుకున్నారు, రాజశేఖరంగారు. కళ్ళద్దాల్ని పంచెతో శుభ్రంగా తుడిచారు. పడకకుర్చీలో పూర్తిగా చేరబడి, అలవాటు ప్రకారం—'...హా ఆర్తత్రాణ పరాయణా... హాయ్...' అని ఆవలించారు. నుదుటిమీద చిక్కపడిన గీతలు చిత్రంగ చలిస్తున్నయ్.

వీధిలో ఎండజోరు హెచ్చుగావుంది! వీధి వరండాకి వేసిన కటకటాల్లోంచి ఎండ చొచ్చుకుని వచ్చి నేలమీద డిజైన్స్ గీసింది. ఎండతాపాన్ని భరించలేక కాబోలు రెండుకాకులు పారిజాతం చెట్టు కొమ్మమీద ముడుచుకు కూచున్నాయి. రాజశేఖరంగారి పరిభాషలో చెప్పాలంటే—'ఎక్కడా తుపాకీ వేస్తే గాల్లేదు'! ఆ పక్క మెయిన్‌రోడ్డు మీంచి వెళ్ళేబస్సుల శబ్దాలు, దూరంగా 'జాలీ ఆయిస్క్రీమ్' వాడికేక తప్పితే దాదాపు ప్రకృతి అక్కడ నిశ్శబ్దంగానే వుంది.

'ఆహాహా! ఏం వర్ణనా! ఏం కవిత్వం! ఒక్కోపదం అక్షర లక్షలు చేస్తుంది గదూ! అసలివి మాటలా? తేనెపాకలుగాని! నవ రసాలూ రంగరించిపోసి, సృష్టిలో మాధుర్యమంతా గుమ్మరించి తయారు చేశాడ, ఏమన్నావా, ఈ కావ్యాన్ని? అమ్మాయ్! గ్లాసుడు మంచినీళ్ళు పట్టా... అబ్బబ్బా యేంవ్వుక్క! వెధవ్వుక్క! తినేస్తుంది'

నేలమీద పడివున్న విసనకర్ర తీసి విసురుకుంటూ ఇంట్లోకి చూస్తున్నారు రాజశేఖరంగారు. పుస్తకాన్ని తెరిచారు కాని దృష్టి అక్కడ నిలవటంలేదు. మనసు పోతనామాత్యుడి కవితా మకరందాన్ని ఆస్వాదించటానికి కుతూహల పడటంలేదు. ఇంద్రియాలన్నీ ఒకే కోరికమీద నిలిచి వున్నాయి. చూస్తున్నారు, రాజశేఖరంగారు, మహావిష్ణువు దర్శనంకోసం మత్తేభంలా! కళ్ళు వెడల్పు చేసుకుని, మెడసారించి, ఇంట్లోకి......

'పలకదేం అమ్మాయి? ఏం చేస్తోంది చెప్మా? పెరట్లో దబ్బు దబ్బున శబ్దం వినిపిస్తోంది. బట్టలుతుకుతూందిగావును.'

ఇప్పటికి డజనుమంది చాకలాళ్ళని మార్చేరు. డబ్బులు వదిలి పోవడమేగాని తమకి సౌఖ్యంలేదు. విసిగిపోయి ఇంట్లోనే రేవు పెట్టుకుంటున్నారు, కావుడే రెక్కలు ముక్కలు చేసుకోవాలి అన్ని పన్లకీ. దమయంతికి వండి వడ్డించేసరికి నడ్డి వాలి పోతుంది. అంతంత మాత్రపు ఆరోగ్యంతో ఎలాగో ముగ్గురు పిల్లల్నికని, ఇన్నాళ్ళ సంసారం చేసినందుకు దమయంతిని అభినందించాలి! పెద్దవాడు కాలేజీకి పోతాడు. రెండోవాడు బడికిపోతాడు. కామేశ్వరి ఇంటిచాకిరీ చేస్తూనే మెట్రిక్ పాసయింది సప్లిమెంటులో! ఆ తర్వాత ఇక చదవనంటే వూరుకున్నాడు తను. తాటి చెట్టెక్కిన వాణ్ణైనా ఇక ఎక్కలేనని మధ్యలో ఆగిపోతే బలవంతంగా తొయ్యగలంగాని — చదవనన్న వాణ్ణి బలవంతంచేసి చదివించలేం! మగ పిల్లలు వాళ్ళ చదువులు. హాయిపిడి! శలవు రోజుల్లో కూడా వూరిమీద తిరగడం! గుండీ వూడినా కావుడే కుట్టి పెట్టాలి! 'రేపు అది అత్తారింటికిపోతే ఎవరు చేస్తార్రా మీకు చాకిరీ?' అంటే— 'అన్నయ్యకి పెళ్ళాం వచ్చేకే నేను అత్తారింటికి వెళతానులే, నాన్నా' అని వాళ్ళని వెనకేసుకువచ్చేది కావుడు! అన్నా, తమ్ముళ్ళంటే దానికంత అభిమానం! గుర్రంలా ఎదిగి కూచున్న పిల్లని అది పెద్దంటే మాత్రం సంబంధాలు చూడకుండా ఎలా ఉంటాడు? చూసినవాట్లో రెండు కట్నం దగ్గర, లాంఛనాల దగ్గిరా ఫెలయినా, మూడోది కుదిరింది. బహుశా మీరాదు మాసంలో ముహూర్తం మంచిది కుదిర్తే అయిపోయినట్టే!

"గోవిందా! యదునందనా! ఇది రాదేం? గొంతు ఆర్చుకుపోతూంది! లేద్దామంటే కాళ్ళు పట్టేశాయి. ఏమిటో! ఈ పెద్ద వయసుకాదుగాని. . . .లేస్తే కూచోలేడు. కూచుంటే లేవలేడు. వయసుడిగిపోతే వాతం వచ్చి చేరిపోతుంది వంట్లో. మొన్న ఆస్పత్రికివెళ్ళి బి. కాంప్లెక్స్ మాత్ర ఇమ్మని చెల్లిన డాక్టర్ణి అడిగితే—"స్టాకు లేదు" అని చెప్పేశాడు. అతను తన కళ్ళముందే ఎం. బి. బి. ఎస్. చదివి, హౌస్ సర్జన్‌చేసి, ఉద్యోగంలో ప్రవేశించాడు! స్టూడెంటు పీరియడ్‌లో ఎంత వినయం కనపరిచేవాడో ఇప్పుడంత దర్జా ఒలకబోస్తున్నాడు! 'స్టాకులేదట!' పదవిలో వున్నవాడి దగ్గర ఒక పదం, బైట కెళ్ళిన వాడికి మరోమాట! అదీ అచోట ఆనవాయితీ!! ముప్ఫయి అయిదేళ్ళ చాకిరీ చేశాడు అక్కడ. ఏం లాభం? ఎవ్వరూ విశ్వాసం చూపరు! అక్కడి సేవకిచిహ్నం ఫలానా రాజశేఖరంగారు ఫలానా ఆస్పత్రికి హెడ్ గుమాస్తా అన్న చెక్కబోర్డు (రిస్ట్‌వాచ్ తో కలిపి!) ఒకటే; ప్రతిఫలాలు (లేక కానుకలు) చేతికర్రా, మఫ్లరూ, భాగవతం పుస్తకమూనూ. టాబ్లెట్లూ, ఇంజెక్షన్లూ లేకపోతే పోయె చివరికి ఇంత కార్మినేటివ్ మిక్చరు కూడా కరువే అక్కడ! ఎవర్ని ఏమనగలడు? ఏముంది హక్కు ఇప్పుడు? విసుగ్గా రోడ్డుమీదికి వచ్చి గొడుగు విప్పాడు. అడుగులువడటం కష్టమయింది. చిరిగిన చెప్పుల్లోంచి పాదాలకి కాలిన రోడ్డు తగిలి చుర్రుమన్నాయి. గాడ్పు ఆ చెవిలోంచి ఈ చెవిలోకి కొడుతూంది! 'ఎక్కడా తుపాకీవేస్తే పిల్లగాల్లేదు' రోడ్డు దాదాపు నిర్మానుష్యంగానే వుంది. బస్సులుమాత్రం తెగ తిరుగుతున్నాయి. ఇంటిదాకా ఈ కాళ్ళీడ్చుకుంటూ ఎలా వెళ్ళగలను భగవంతుడా! అని భయపడ్డాడు. గొంతు వో పక్కన ఆరిపోతూంది. ఆస్పత్రిలోనయినా ఇన్ని నీళ్ళడిగి తాగేడుకాదు. ఈ శోషతో ఇలా నడిస్తే తోవలో చచ్చిపోతాడేమో! ప్రాణం పోవడానికేముంది? ఆ యింతా—ఒక్క క్షణం చాలు. రెండు వారాల కిందట పక్కింటి డాక్టరుగారి ఆఖరబ్బాయి బడికి వెళ్తూన్నూ బస్సుక్రిందపడి చచ్చిపోయేడు! శుభ్రంగా— ఆరోగ్యంగా — అందంగా—చురుగ్గావున్న కుర్రాడు. ప్చ్! వాడికంతే ఆయుర్దాయం రాసివుంది. వాడి మరణం అలా వుంది! తనకి? ఇప్పు డెక్కడిలా రాసిపెట్టివుందేవో? దాహంతో—పచ్చి మంచినీళ్ళు లేకుండా— నడి రోడ్డు మీద—మండు ఎండలో— చుట్టూ పిట్టయినా లేకండా!! ఇలాకాక పోయినా—పరధ్యాన్నంగా నడుస్తున్నవాణ్ణి ఏ బస్సొచ్చి గుద్దివచ్చు. చావుకేముంది? అమ్మో! భగవంతుడా' నుదురంతా చెమట పట్టింది. చొక్కా చెమటతో తడిసి ముద్దయింది. కాళ్ళలో సన్నగా వణుకు!

కొడుకులూ, కూతురూ, భార్యాచుట్టూ చేరివుండగా మరణించే అదృష్టం తనకి లేదు. వాళ్ళ మాటలూ, శోకాలూ వినే యోగంలేదు కాబోలు! పోయింతర్వాత ఏదెలా జరిగితే తన కేం తెల్సివస్తుంది? అని బాధపడ్డాడు. దూరంగా రిక్షా కనిపిస్తే బలవంతంగా గొంతు పెకల్చుకుని కేక వేశాడు. వాడు వచ్చి మువ్వావలా అడిగాడు. బేరమాడబోతే విసుగ్గా కసిరి వెళ్ళిపోయాడు. ముసలివాళ్ళని చూస్తే ప్రతీ వెధవకీ చులకనే అని తిట్టుకున్నాడు. కుళాయి కనిపిస్తుందేమో అని చూశాడు. ఆ రోడ్డు పక్కన కుళాయి వుంది. నీళ్ళు పడుతున్నాయి, సన్నని ధారగా.....అయితే దాని చుట్టూ బిందెలు, కుండలు, తప్పేలాలు, కావిళ్ళు గుట్టపోసి ఉన్నాయి! 'నాకంటే నాక'ని ఆడాళ్ళు యుద్ధాలు చేస్తున్నారు. ఒక మొగుడి గురించి ఇద్దరు సవతుల మధ్య కూడా అంత కసిగా యుద్ధం అవదు! ఒక ఆడదానికోసం ఇద్దరు మగాళ్ళు కూడా అంత ఘోరంగా కొట్టుకు చావరు! బిందెడు నీళ్ళకి అక్కడ దేవలోకంలో అమృతానికున్న వేల్యూ వుంది! భూలోకంలో కాఫీకున్న ప్రెఫరెన్సువుంది! ఇండియాలో బంగారానికున్న విలువుంది! స్వాములోర్లకున్న డిమాండు వుంది! సినిమా యాక్టర్లకున్న పరపతివుంది! ఎంత చక్కని సీను అది! అనుకున్నాడు. కవి కాకుండానే తనకి ఇన్ని వూహాలు వస్తున్నాయే! వోపిక లేకపోయినా ఇంత చక్కగా అభివర్ణించుకున్నాడే! అని కాస్త ఆశ్చర్యపోయాడు. అత్యవసరంవస్తే ఆయుధాలుకింద మార్చుకోడానికి అమర్చుకున్న ఆ పాత్రలన్నింటితో కూడిన—ఆ రణరంగంలోకి—ఆ పద్మవ్యూహంలోకి చొరబడేందుకు తను అభిమన్యుడుకాడు. క్రిక్కిరిసివున్న బస్సులోకి— ఇలాంటి స్థితిలో కుళాయి దగ్గరికి— ఫస్టుడే సినిమాకి చొచ్చుకుపోయే సాహసం వోపికా తనకి వయసులో ఉండేవి. ఇప్పుడు కోరలు వూడిన నాగు—పులుపు చచ్చిన చింత— వోపిక ఉడిగిన దుక్కిటెద్దు. . .

ఐస్‌ఫ్రూట్ కుర్రాడు బండీ తోసుకుంటూ వెళ్ళిపోతున్నాడు. నోరువూరింది అమాంతం మనాడు ఐస్‌ఫ్రూట్‌లు

కొనేసి తినేద్దామనుకున్నాడు. దాహం తీరుతుంది. చిన్నప్ప డెప్పుడో అవితిన్నాడు. మళ్ళీ ఆ రుచి చూడలేదు. ఈ మధ్యకాలంలో అనేక రుచులు చూశాడు. పెళ్ళి—పిల్లలు—పురుళ్ళు—పుణ్యాలు రోగాలు—మందులు—ప్రమోషన్లు—మీద వాళ్ళచేత మందలింపులు — కష్టసుఖాలు, ఎత్తు పల్లాలు....ఒక్కసారి చిన్నతనం వచ్చేస్తే ఎంత బావుంటుందో?! ఆ దశలో ఏబాదర బందీ లుండవుగదా! మళ్ళా ఆడుకొంటూ బిస్ ఫ్రూట్‌లు కొనుక్కు తింటూ. . .నోరు పూరి, నాలికతో పెదాలు తడిపాడు. ఎవరైనా చూసి ఏమిటీ పని చిన్నపిల్లాడా అని అనుకుంటారేమోనని సిగ్గుపడిపోయాడు. ఇలా అనుకొంటూండగానే బిసుకుర్రాడు కాస్త చూపు కందనంతదూరం, పిల్చినా వినబణ్ణంత దూరం వెళ్ళిపోయాడు. మళ్ళా చావుమీద భయం పుట్టుకు వచ్చింది. ఇవాళ దమయంతి వంకాయ సూలు వప్పేసి పెరుగుతో పచ్చడి చేస్తానంది. అరటికాయ, పుల్లిపాయ వేపుడు చేస్తానంది. ఆస్పత్రినించి తెల్సిన వాళ్ళింటికీ వెళ్ళకండా సన్నాసుకు తిన్నగా వచ్చేయమంది. ఆ పచ్చడి అంటే తనకి ప్రాణం. అది తినే ప్రాప్తం లేదేమో అని విచారించాడు. ఎల్లాగో వోపిక కూడదీసుకుని రెండు సందులు మళ్ళి వో స్నేహితుడింట్లో చొరబడి రెండు గ్లాసుల నీళ్ళు తాగి కాస్సేపు ఆయాసం తీర్చుకుని, ఇల్లు చేరుకున్నాడు.

ఎంత దుర్భరమైన పరిస్థితి అవేళ్ళిది! భగవంతుడా! ఆ స్థితి పగవాడికయినా ఒద్దు తండ్రీ—అనుకున్నారు రాజశేఖరంగారు. "కాముడూ. . ." అని కేక వేశారు లోపలికి చూస్తూ. కామేశ్వరి మంచి నీళ్ళు తెచ్చి "ఇంక మళ్ళా పిలవకు, నాన్నా. నాకు చాలా పనుంది" అంది.

"మీ అమ్మ ఏం చేస్తోంది? నిద్రేనా?"

"తల నెప్పిగా వుందని పడుకుంది"

"ఏమిటో తల్లీ....నువ్వున్నావు కాబట్టి ఇంకెడు చాకిరి చేసుకు వస్తున్నావు. నువ్వు అత్తారింటికి వెళ్ళిపోతే మా పాట్లున్నాయి"

"నేను పెళ్ళి చేసుకోను నాన్నా"

"వోహో! ఇది పెళ్ళవక మునుపు ప్రతి ఆడపిల్లా ఆడే మాటేలే! అయింతర్వాత మా మొహాలైనా చూడకండా వెళ్ళిపోవటే, ఆ పెద్ద చెంప లబ్బాయి వెంటా?. . . ." కళ్ళు అరవాల్చి ఎన్వీఆర్ ఫోజులో నవ్వుతూ చూశారు.

"ఫో నాన్నా...." కామేశ్వరి తుర్రున పరిగెత్తింది.

ఇంత సేపటికి చల్లగాలి సుళ్ళు తిరుగుతూ వచ్చి, మృదువుగా తట్టిపోతూంది. రాజశేఖరంగారు కాళ్ళు స్టూలుమీద బార చాచి, చేతులు వెనక్కి చాపి, కళ్ళుమూసుకున్నారు. వీధిలో కేక వినిపించింది. కనుబొమలు ముడిచి "ఎవరూ?" అనడిగారు.

"బాబయ్యా" దీనంగా....జాలిగా..... వణికే బొంగురు గొంతు.

"వేళాపాళా లేదట్రా? వెళ్ళిపో"

"పేగులార్చుక పోతన్నాయి బాబయ్యా సిన్న కాడ్నించి పట్టెడు ముద్ద పెట్టే మారాజులు కరువైనారు...."

'మంచి నిద్ర పోగొట్టాడు' అని విసుక్కున్నారు రాజశేఖరంగారు. అంతవరకు రాని చల్లని గాలి తెర అప్పుడే వచ్చి—ప్రాణం సేద తీరుతున్న సమయంలో—మత్తుగా కళ్ళు మూత పడుతూంటే—ఒక్క కేకతో ఆ కమ్మటి అనుభవాన్ని పారదోలిన ఆ ముష్టివాడిమీద ఆయనకి విపరీతంగా ఆగ్రహం కలిగింది. నిద్ర పట్టడమే కష్టం. నిద్ర మాత్రలు వేసుకుంటే గాని అది లొంగిరాదు. కళ్ళు గట్టిగా మూసుకుని, ఇందాకటి అనుభవాన్ని ఇంకా వదులుకోని స్థితిలో ఉన్నారు.

"బాబా...బుక్కెడు గంజన్నా పొయ్యండయ్యా"

ఆ గొంతు తెగటానికి సిద్ధంగా వున్న వీణ తీగెలా ధ్వనించింది.

రాజశేఖరంగారు తల అటు తిప్పారు.

కమ్మటి అనుభవానికి స్వస్తి చెప్పి—బలవంతంగా కను రెప్పలు విప్పి—భారంగా తల అటు కదిల్చి — వీధి వరండా లోంచి, కటకటాల తలుపు లోంచి అవతల నిలబడున్న ముష్టివాణ్ణి చూశారు. పండి, ఎండిన పీచులాంటి జుత్తు. ఒడిలిపోయి ముప్పై మూడు ముడతలు పడిన ముఖంలో—గాజుబుడ్లలాంటి కళ్ళు. బోసినోటిలోంచి—నూతిలోంచి వినవచ్చే స్వరం. మాంసం జీర్ణించిపోయిన



ఎముకల పంజరంమీద వో ముతకగుడ్డ— పంచెగా—ఆచ్ఛాదితమై వుంది. డాల్డా డబ్బా వణుకుతూంది.

"బుక్కెడు గెంజి....బాబా....పేణం నిల కండి"

రాజశేఖరంగారు వాడు పక్కింటికి పోతే బావుణ్ణనుకున్నారు. కామేశ్వరిని పిలిచారు రెండుసార్లు. ఆ పిల్ల రాలేదు. పలకలేదు. అదిలా ఒక్కసారి వస్తే బావుణ్ణు. ఆ గంజి పోసేస్తే పోతాడు. ఇవాళ అన్నం ఏం మిగల్లేదు. బియ్యం దొరకడం కష్టంగా వుందని దమయంతి తూచి తూచి వండుతూంది. పోనీ ఆ గంజి పోసేస్తే సరి! ఇంట్లో ఇంకెవరూ లేరు. తను లేద్దామంటే కాళ్లు పట్లు పట్టేశాయి. అవతల వాడి స్థితి చూస్తుంటే మరో అయిదు నిమిషాలలాగే వుంచితే ఆ యింతా ప్రాణాలు ఒదిలేటట్టు వున్నాడు! దాన్పోయే పాపం నెత్తికి చుట్టుకుందన్నట్టు?! అయినా ఎన్నాళ్లాయి సరిగ్గా తిండి లేదో?! అందులో ముసలి ప్రాణం!

రాజశేఖరంగారి ఆలోచనా కడలిలో వో కెరటం వెనకనించి లపతప ఒకే వేగంతో వచ్చి, హోరుపెట్టి, ఆయన్ని ముంచెత్తిపోయింది. నడిరోడ్డుమీద—మండే ఎండలో చుక్క నీటికోసం అగ్గగ్గలాడిపోయే ఆరోజు! ప్రాణం పోతుందేమో! అని భయపడే ఆవేళ! నిజంగా—తను తల్చినట్టు జరిగితే దిక్కులేని చావు అన్నమాటది!

"బాబా!...." నూతిలోంచి వినవచ్చే గొంతు! తెగుతున్న తీగె!

రాజశేఖరంగారి ఒళ్లు చెమటలు పోసింది. కుర్చీలోంచి లేచారు. బల్ల తగిలి, దానిమీదున్న భాగవతం కిందపడింది. ఆ పుస్తకాన్ని తీసి కళ్ల కద్దుకుని, బల్లమీద వుంచారు.

గజేంద్రమోక్షంలో—గజేంద్రుడిలా కనిపిస్తున్నాడవతలి ముష్టివాడు. 'రావే ఈశ్వర కావవే వరద! సంరక్షింపుము భద్రాత్మకా!' అని ఎలుగెత్తి ప్రార్థిస్తున్నాడు కరిరాజు.

'బుక్కెడు గెంజిపోసి ప్రాణాలు నిలపమని" అర్థిస్తున్నాడు ముష్టితాత!

మొసలి బారినుండి తప్పించమని వేడుకొంటున్నాడు గజరాజు!

ఆకలిబాధనుండి తప్పించమని అరుస్తున్నాడు ముష్టితాత!

కాస్త గంజి పొయ్యటానికి తాను మహావిష్ణువులా శేషతల్పాన్ని దిగక్కర్లేదుగాని— గంజిపోస్తే వాడి దృష్టికి తను వాడి ప్రాణాన్ని నిలిపిన దేవుడే అవుతాడు. పొట్ట పూపుకొంటూ రాజశేఖరంగారు గబగబ ఇంట్లోకి వెళ్లారు. గంజి పొయ్యమని కూతురికి చెప్పడానికి. అక్కడి దృశ్యంచూసి స్తంభించిపోయారు. నిజానికి ఆయనలా స్తంభించిపోయేంత ఆశ్చర్యకరమైన దృశ్యం ఏం కాదది. ఎప్పుడూ చూసేదే! ఇప్పుడు మాత్రం ఆయన్ని స్తంభింపచేసింది.

కామేశ్వరి గిన్నెలో గంజిని నీళ్లు కలిపి పల్చగా చేస్తూంది. అందులో—పుతికిన బట్టల్ని ముంచి వో పక్కన పెడుతూంది, ఆరేయటానికి.

'అరెరె! ఎంతపనయింది!' అని బాధపడ్డారు.

ఆ గంజి— ఆ ముష్టితాత దప్పికని, ఆకల్ని తీర్చి, ప్రాణాన్ని నిలబెట్టే అమృతం. అందులో వాడి జవం వుంది. జీవం వుంది. వాడికి పిల్లలుంటే వాళ్లకి తండ్రిని బతికించి ఇచ్చే పుణ్యం వుంది. వాడికి భార్య వుంటే దాని మాంగల్యం తెగిపోకుండా చేసే మహత్యం వుంది. వాడే ఆ ఇంటి కాధారమైతే, ఆ ఆధారాన్ని నిలబెట్టే ప్రయోజనం వుంది. ఆ గంజి—అతి సామాన్యంగా కనిపించే గంజిలో ఎంత విశేషం వుంది?!

అదంతా...నీళ్లు కలిపి పల్చగా...అదీ ప్రయోజనకరమైనదే అయినా (ఇప్పుడు తన దృష్టిలో కాదు) మరో పనికి వినియోగపడబోతూంది. జీవం వున్న మనిషికి కాకుండా జీవరహితమైన ఆ గుడ్డలికి ఉపయోగపడబోతూంది!

ఎంతపనెంత పనయింది! కాస్త ముందొచ్చివుంటే కావుడు గెంజిలో నీళ్లు పోసేసేది కాదుగదా! భగవంతుడా! అవతల ఆ ముసలాడు ఆ యింతా చచ్చూరుకున్నాడేమో!

అడుగులో అడుగేసుకొంటూ అక్కణ్ణించి నడిచారు. గేటు దగ్గర బిచ్చగాడు లేడు! ఆశ్చర్యంగా గేటు దగ్గరికి వెళ్లి గేటుతీసి చూశారు.

ఇంటికి ఎడం పక్కన—పదడుగుల దూరంలో—నేలన— వో పక్కకి వొరిగిపోయివున్నాడు. చాచిన చేతికి అంతమూరాన ఖాళీ డాల్డాడబ్బా పడి ఉంది.

ఆ కళ్లు ఇప్పుడు, ఇందాకట్లా అస్థిరంగా చలించటంలేదు. ఆ నోరు ఇప్పుడూ తెరిచేవుందిగాని — ఆకలాకలని ఆర్తనాదం చెయ్యటం లేదది.

రాజశేఖరంగారు ప్రతిమనూదిరిగా ఉండిపోయారు. ●

బంగ్లాదేశ్‌లో వైద్యసహాయం చేయడానికి బయలుదేరి వెళ్లిన బ్రిటిష్ రెడ్‌క్రాస్ బృందం. 26 సంవత్సరాల వైద్యవిద్యార్థిని కుమారి హీత్, (ఎ)క్సర్ డేవిడ్ విలియమ్స్, 25 సంవత్సరాల నర్సు కుమారి వస్మర్స్, శ్రీ అన్సాన్స్ పాటర్, శ్రీమతి జేనెట్ ఆడలోన్.